కథ 2013

8



# నీలా వాళ్లమ్మ మరికొందరు...

విమల

“నీ లూ!”

నిద్రకళ్లతో జోగుతూ మంచం పక్కనే కుర్చీలో కూర్చున్న నీలవేణి, వులిక్కిపడి తలెత్తింది. నీరసంగా పిలుస్తోంది శ్యామల. నీల బెల్ కొట్టగానే, ఆయా క్షణంలో వచ్చి, బెడ్‌ప్యాన్ పెట్టి, పక్క సరిచేసి వెళ్లింది.

మణికట్టుకు గుచ్చిన, మొఖానికి అమర్చిన సన్నటి గొట్టాల గుండా, ఆమెలోకి జీవాన్ని ప్రవహింప జేస్తున్నారు డాక్టర్లు. ఏడాదిగా కడుపులో క్యాన్సర్ కంతితో చేస్తున్న పోరాటం, మరో నాలుగైదు రోజులకి ముగిసి ఆమె మరణించ బోతూ ఉందని డాక్టర్లు చెప్పేశారు. కీమోథెరపీతో శరీరంలోని కణాలన్నీ కాలిపోయి వళ్లంతా రకరకాల మందులతో నిండిపోయి చావుబతుకుల మధ్య తెగిన వంతెనలా వేలాడుతూ ఆమె అట్లా పడుంది.

“ఎలాగూ చనిపోయేదాన్నేకదా! నన్నిట్లా హింసిం చకండి,” అని ఆమె చెప్పిన మాటలను ఎవరూ విని పించుకోలేదు. వడలిపోయిన ఆమె ముఖంలో బాధా వీచికల ఛాయలు, నుదుటి మీద సన్నని ముడతలు, ఎండిపోయిన పెదవులు, ఛాయ నల్లబడి, ఎముకలు తేలిన శరీరంతో, గువ్వలా ముడుచుకుని, పక్కకు వత్తి గిల్లి పడుకుని సన్నగా మూలుగుతోందామె. బలహీన మైన తన చేతితో నీల చెయ్యి పట్టుకుని చిన్నగా నవ్వింది.

ఆ నవ్వుకి నీల హృదయం మెలిపెట్టినట్లయింది. కళ్ల నుండి కన్నీళ్లు రాని దుఃఖం. లోలోన సుళ్లు తిరు గుతూ మహాశూన్యంలో నిలబడ్డ తన చేతి నుండి, అప్పటిదాకా, తనను గట్టిగా పట్టుకున్న దేహరహిత చెయ్యొకటి. బిగువు సడలి మెల్లిగా జారిపోతున్నట్లు. తనట్లా కదలలేక, అరవలేక, ఏడ్వలేక, ఒంటరిగా పరమ నిస్సహాయంగా ఏం చెయ్యలేక నిలబడ్డట్టు, అట్లా జారిపోతున్న చెయ్యి ఒక్కోసారి తనదే అయినట్లు. మరో నాలుగురోజులకి శ్యామలా టీచర్ నిరాకారంగా దేహ ధూళి అయిపోయి, మహా శూన్యంలోకి అదృశ్యమైపో తుందా? తానొక్కతే దిక్కుతోచక లోనంతా ఏమీలేని ఒక ఖాళీ నీలవేణి దేహంలా మిగిలి పోతుందా? ఎందుకిట్లా జరుగుతోంది? నీలకి చాలా కష్టంగానూ, కోపంగానూ వుంది. ఎవరినన్నా తిట్టాలని, గట్టిగా అరవాలని వుంది.

“నీల ఎక్కువగా మాట్లాడదు. మంచిపిల్ల,” అంటారంతా.

“మంచివాళ్లనిపించుకోవాలంటే, నీలా తక్కువ మాట్లాడేలేమో,” అంటారామె స్నేహితురాళ్లు. నీల అప్పుడూ నవ్వి ఊరుకుంటుంది. ఎవరికి తెలుసు? నీల తన లోలోపల, తనతో తానే, ఎడతెగని సంభాషణ సాగి స్తుంటుందని. తల్లి చనిపోవడానికి ముందు, తను చాలా ఎక్కువ మాట్లాడేదట. ఆ తరువాత... ఆ మాటలు, ప్రశ్నలు ఏమైపోయాయి నీలా అంటూ శ్యామల ఆశ్చర్య పడేది అప్పుడప్పుడూ.

ఉదయం పదిగంటలకి శ్యామలా టీచర్ తమ్ముడు, మరదలు వచ్చాక, నీల స్నానం చేసి, కాస్సేపు రెస్టు తీసుకునేందుకు ఇంటికెళ్లింది. గేటు తీసి లోని కెడుతుంటే ఆ చప్పుడికి పక్కింట్లోంచి సుజాత బయటి కొచ్చింది.

“ఎలా ఉంది శ్యామలకి?” అడిగింది.

''రాత్రంతా నిద్రపోలేదు. బాగా నొప్పిగా వున్నట్టుంది. ఒకటే మూలుగుతోంది,'' అంది నీల.

సుజాత, శ్యామల చిన్నప్పటి నుండీ స్నేహితులు. యాభై ఏళ్ల స్నేహం వాళ్లది. సుజాత చల్లటి స్నేహఛాయ శ్యామలకి లేకపోతే, ఆమె ఏమయ్యేదో తెలీదు.

శ్యామల ఉద్యోగాలంటూ ఊర్లు పట్టుకు తిరుగుతూ ఉంటే సుజాత, వాళ్ల ఆయన ఇద్దరూ పట్టుపట్టి తమ స్థలం పక్కనే ఆమెకో స్థలం కొని దగ్గరుండి మరీ చిన్న ఇల్లు కట్టించిపెట్టారు. శ్యామల దగ్గరికన్నా సుజాత దగ్గరే నీలకి చనువెక్కువ. తన పిల్లలతో పాటు, ఓ పిల్లగా నీలని చూస్తుంది సుజాత.

ఇంట్లోకి అడుగు పెట్టాలంటే భయమేస్తోంది నీలకీమధ్య. ఈ ఇంట్లో అప్పట్లా సజీవంగా శ్యామలా టీచర్ కనపడదింకెన్నడూ, అన్న ఊహ ఆమెని భయపెడుతోంది. స్నానం చేసి కంప్యూటర్ ముందు కూర్చుని మెయిల్స్ చెక్ చేస్తూ వుంటే కనిపించింది, ఆఫీసులో తనతోపాటు పనిచేసే నజీర్ ఉత్తరం. పదిరోజులుగా ఆఫీసుకి నీల రాకపో వడం ఎంత వెలితిగా ఎంత బాధగా వుందోనంటూ కవిత్వం రాశాడు. నవ్వొచ్చింది నీలకి. తనపట్ల అతడి కళ్లలో కనపడే ఇష్టం అర్థమవుతుందామెకి. తను కొంచెం నవ్వి ఒక అడుగు ముందుకేస్తే అతను తప్పక తనని ప్రేమిస్తున్నానన్న విషయం కూడా చెప్తాడని తెలుసు. ఎందుకో అట్లాంటి మాటలు హృదయపు లోతుల్లో నుండి వచ్చినవిగా కాక పొడిపొడి మాటలుగా అనిపిస్తాయి నీలకి. ఏ హేతువుకూ అందనిది ప్రేమైతే దానికి అంత శక్తే ఉంటే భౌతిక అవసరాలకి, స్వార్థానికి, లోకనిందకి, మనుష్యులు ఎందుకు లొంగిపోతారు! పాతికేళ్ల నీలకి జీవితం సంక్లిష్టభరితమైన, పూరించటం కష్టమైన, గళ్ల నుడికట్టులా కనిపించటం మొదలై చాలాకాలమే అయింది.

''నువ్విట్లా భోజనం చేయకుండా కూర్చుంటావని తెలుసు నాకు. పద, కాస్త తిందువుగాని,'' అంటూ తాను తెచ్చిన కూరల్ని, అన్నాన్ని కంచంలో వడ్డించి, దగ్గరికి పట్టుకొచ్చింది సుజాత. తినక తప్పలేదు నీలకి.

''ఇంటికి తీసుకెళ్లమని అడుగుతోందాంటీ. కానీ శేఖర్ అంకుల్ ఒప్పుకోవడం లేదు.'' శ్యామల తమ్ముడు శేఖర్‌తో మాట్లాడతానంది సుజాత.

''అసలు దానికీ కీమోథెరపీలు, ఆసుపత్రుల వాసన, మందులు ఏవీ ఇష్టంలేదు. కనీసం చనిపోయేప్పుడన్నా దాని ఇష్ట ప్రకారమే, ఇంటికి తీసుకొద్దాంలే,'' అందామె.

సుజాత కాస్సేపు తన ఇంట్లోకొచ్చి పడుకొమ్మని అంటే, నీల 'వద్దు ఇంట్లోనే పడుకుంటాన్లే,'' అంది.

సుజాత వెళ్లిపోయాక, ముందు తలుపేసి బెడ్‌రూంలోకొచ్చి నిద్రపోయేందుకు కాస్సేపు ప్రయత్నించి, విఫలమైంది. పుస్తకం తెరిస్తే, చదవాలనిపించలేదు. ఏవో జ్ఞాపకాలు, అలజడి, అశాంతి. మెల్లిగా లేచి అల్మారా అడుగు అరలో దాచిన బట్టసంచీని తీసింది నీల. నాలుగైదేళ్ల క్రితం ఆ సంచీని ఆమె చేతిలో పెట్టింది శ్యామల.

ఆరోజు, ఆరోజు జరిగిన బీభత్సం తరువాత శ్యామలా టీచర్‌తో కలిసి వెళ్లిపోయే ముందు తను పోగేసుకున్న వస్తువులవి. అమ్మ కాలిమువ్వలు, పగిలిన గాజులు, నెత్తుటి మరకలంటిన చీరముక్క, తన విరిగిన పలక, ఎవరో కాలితో తొక్కేస్తే అణిగిపోయిన, తన కిష్టమైన ప్లాస్టిక్ బొమ్మ... ఆ బొమ్మకి అమ్మ కుట్టిన లంగా జాకెట్ ఇంకా, అలాగే ఉన్నాయి. ఇవన్నీ పోగుచేసిన విషయం, తనకి జ్ఞాపకమే లేదనుకుంది నీల.

నీల ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం పరీక్షలయ్యాక వేసవి సెలవుల్లో ఓరోజు శ్యామల నీలతో మాట్లాడాలంది.

అప్పుడే ఈ బట్టసంచీని, అందులోని వస్తువుల్నీ నీల మొదటిసారి చూసింది. అస్పష్ట జ్ఞాపకాల తెరలు కళ్ల ముందు కదలాడి మనసు అడుగు పొరల్లో ఎక్కడో నిక్షిప్తమైపోయిన అమ్మ ఒక నీటిచెలమలా, లోలోన ప్రవహించి... కళ్ల నుండి తెలీకుండానే కన్నీరు జాలువారి ఆ వంటరి కాలిమువ్వల పట్టీని చేతుల్లోకి తీసుకుని నిమిరింది నీల. అమ్మ స్పర్శని అనుభవిస్తున్నట్లు.

''ఈ వస్తువులు నువ్వు నాతోబాటు వచ్చేసే ముందు తెచ్చుకున్న జ్ఞాపకాలు. అంతటి విషాదం, బీభత్సం కలగలసిన ఆ జ్ఞాపకాలు. నీడలా నీ బాల్యం అంతా, నీ వెంటనే కొనసాగటం ఇష్టమనిపించక, నీక్కనపడకుండా నేనే దాచేశాను,'' అంది శ్యామల.

''మరి ఇప్పుడెందుకు...'' వాక్యం పూర్తి చేయకుండానే మధ్యలోనే ఆపేసింది నీల.

''నేను చెప్పే విషయాల్ని అర్థం చేసుకోగల పరిణతి నీకుందనిపించింది.''

'పరిణతి అంటే ఏమిటి?' అనడగాలనుకుని ఊరుకుంది నీల.

''నీకు, నీ గురించిన విషయాలేవీ చెప్పకుండానే చనిపోతానేమోననిపించిందెందుకో ఈమధ్య. నేను లేనప్పుడు నీ గురించి నీకు చెప్పేవాళ్లెవరూ లేకపోవచ్చు.

నీకు నీవాళ్లను కలుసుకోవాలని ఎప్పుడన్నా అనిపిస్తే నేన్నీకు ఆ అవకాశం లేకుండా చేశానని నువ్వనుకో కూడదు,'' అంది శ్యామల.

''మీరు తప్ప నాకు నావాళ్లనే వాళ్లెవరున్నారు టీచర్?'' అంది నీల.

''నీకో నాన్నున్నాడు. మీ అమ్మకి తల్లి, చెల్లెలు, తమ్ముడు కూడా వున్నారు. అయితే వాళ్లంతా ఎక్కడుం టారో తెలీదు నాకు.

నీలకి కొత్త వరసలు ఎవరి గురించో వింటున్న కథలాగున్నాయి. ఎనిమిదేళ్ల వయసులో నీల శ్యామల తో పాటు హైదరాబాద్‌కి వచ్చేసింది. తన తండ్రనబడే వ్యక్తి ముఖం ఎంత గుర్తు చేసుకుందామన్నా గుర్తుకు రాదు. అసలతను బతికి వున్నాడో లేడో కూడా తెలీదు ఆమెకి.

శ్యామల మాట్లాడటం మొదలుపెట్టింది.

''నేనప్పుడు కరీంనగర్‌లోని జమ్మికుంటలో మా దూరపు బంధువులు పెట్టిన స్కూల్‌కి ప్రిన్సిపాల్‌గా వచ్చాను. అక్కడ దాదాపు నాలుగేళ్లున్నాను. మా ఇంటి పక్కింట్లో మీరు అద్దెకి దిగారు. మీ అమ్మ నిన్ను మా స్కూల్‌లోనే చేర్పించింది,'' గుర్తుందన్నట్టు తలాడిం చింది నీల. అప్పటి రోజులు గుర్తుకొచ్చాయి శ్యామలకి. నీలా వాళ్లమ్మ పద్మ పక్కింట్లో దిగినరోజు ఆదివారం కావడంతో శ్యామల ఇంట్లోనే ఉంది. వాళ్ల ఇంట్లోకి సామాన్లు చేరుస్తుంటే నీల పద్మ చంక దిగనని, ఆకలి అని మారాం చేస్తుంటే శ్యామలే ఆ పాపని తనింట్లోకి తీసుకొచ్చి అన్నం పెట్టింది. అట్లా ఐదేళ్ల నీల శ్యామల ఇంట్లోకి మొదటిసారి అడుగుపెట్టింది. అన్నం తిన్నాక అక్కడే పడుకుని నిద్రపోయింది. పద్మ మంచినీళ్లడిగితే ఇంట్లోంచి, బిందెతో నీళ్లు తీసుకెళ్లి ఇచ్చింది. అప్పుడే ఇంట్లోకొచ్చిన నీలావాళ్ల నాన్నని పరిచయం చేసిందామె. అతడి పేరు రాజేశం. సన్నగా, పొడుగ్గా నల్లటి ఛాయతో వున్నాడు. చెప్పులతో సహా, తెల్లటి బట్టలేసుకున్న అతను చేతిలోని భోజనం ప్యాకెట్లను కిందపెట్టి నమస్కారం చేశాడు. ఆ హడావిడిలో అతడి చేతిలో నుండి కాలు తున్న సిగరెట్ ముక్క జారి క్రిందపడింది.

శ్యామల ఇంత వర్ణించినా, తనకి నాన్నయ్యే వ్యక్తి రూపం నీలకి గుర్తురాలేదు.

ఆ తరువాత అతను వారంపాటు కనిపించలేదు. అతను ఏవో కాంట్రాక్టు పనులు చేస్తాడని, ఆ పనుల పైన తరచూ వేరే వూర్లకెడుతుంటాడని, శ్యామల అడక్క పోయినా సంజాయిషీ స్వరంతో పద్మ చెప్పిందోసారి. నీల రోజూ, శ్యామలతో పాటు బడికి వచ్చేది. ఇంటి దగ్గర కూడా ఆ పిల్లకి శ్యామలే చదువు చెప్పేది. ఓ రాత్రి పక్కింట్లో ఏవో వాదనలు, గొడవ, ఏదో దబ్బున పడిన చప్పుడు, ఆపుకుంటున్న దుఃఖ స్వరం. శ్యామలకి సరిగ్గా నిద్రపట్టలేదా రాత్రి. మొగుడూ పెళ్లాల మధ్య పంచా యితీ జరిగితే ఎప్పుడూ ఆ ఆనవాళ్లు భార్యల ముఖం మీదే ఎందుకు కనబడతాయో అర్థమయ్యేది కాదు శ్యామలకి. ఇప్పుడు మళ్లీ పద్మ మొఖం. కొద్దిగా వాచిన మూతి, ఎర్రబడ్డ కళ్లు, నుదిటిపైన గడ్డ కట్టిన నెత్తుటి మరక... నీలని బడికి పంపేందుకు బయటికొచ్చిన ఆమె ఏం మాట్లాడలేదు. శ్యామల కూడా మౌనంగా నీల చేయందుకుని వెళ్లిపోయింది.

అప్పుడప్పుడూ బియ్యం, పప్పులు, పంచదార అంటూ చేబదుళ్ల కోసమొచ్చేది పద్మ. ఎప్పుడూ ఆ ఇంట తిండికి కటకటలాడుతున్నట్లుగానే ఉండేది. ఆ భర్త ఎందుకు ఇంటికి సరిపడా సామాన్లు కొనివ్వలేడో, ఎందుకు అతడొచ్చినప్పుడు మాత్రమే కోడికూర ఘుమా యింపులతో ఆ ఇల్లు పరిమళభరితమవుతుందో తెలిసేది కాదు శ్యామలకి.

ఒకసారి తన ఆర్థిక ఇబ్బందుల గురించి పద్మ చెప్పబోతే, ''ఇంటర్ వరకూ చదువుకున్నావ్ కదా! ఏదో ఒక పని చేసుకోవచ్చు కదా!'' అంది శ్యామల.

'మా ఆయనికి నేను బయటికి పోవుడు ఇష్టముం డదు. ఇంటికాడుండి జేసేపని... బీడీలు చుట్టుడో, పోర గాల్లకి ట్యూషన్ జెప్పుడో, ఏదన్నొకటి ఇప్పించుం డ్రక్కా,'' అంది.

శ్యామలకి చాలా చికాకనిపించింది. ''ఊర్లోకెళ్లి ఏ కార్ఖానావాళ్లనో అడిగితే దొరుకుతుంది. నన్నడుగుతా వెందుకు?'' అంది విసుగ్గా.

హఠాత్తుగా కళ్ల నిండా నీళ్లు నింపుకుని మెల్లిగా ఏడ్వటం మొదలుపెట్టింది పద్మ.

''అతనికి నేను సంపాదించుడు ఇష్టముండదు. పైసల్ చేతులుండే పెండ్లాం సుత మాటినదంటడు. బయటికెల్లి పనిజేస్తే, నన్ను తగులకున్నట్లే, ఇంకెవల నన్నా తగులుకుంటావేమో! అంటడు,'' అంది.

ఆ పదానికి, ఆ తగులుకోవడం అన్న పదానికి ఉలిక్కిపడింది శ్యామల. సరిగ్గా ఇదే మాట 'తగులుకు నేందుకు, మరొకడు దొర్కకపోడులే,' అని పదిహేడేళ్ల క్రితం చివరిసారి డాక్టర్ సురేష్‌కుమార్ అన్న మాట గుర్తొచ్చింది శ్యామలకి. ఇంక అదే, ఆఖరిసారి, ఆమె అతడ్ని కలవటం.

"పిల్లి పిల్లని దిప్పినట్లు ఊర్లు దిప్పుతడు. గీడెన్ని రోజులుంచతడో ఎవలకెర్క. అచ్చిండంటే పండుగ జేస్తడు... పోయినంక ఎండి సచ్చుడే. నా చేతిల పైస వుంచడు," అంది పద్మ.

పద్మ అతని భాషలో, అతడ్ని తగులుకోవడం కంటే ముందు రకరకాల పనులు చేసింది. దుకాణంలో సేల్స్‌గర్ల్‌గా పనిచేసింది. తల్లితోపాటు బీడీలు చుట్టింది. పిల్లలకి ట్యూషన్‌లు చెప్పింది. గ్రామాల్లో పొదుపు సంఘాల్ని కూడగట్టే పనిచేసేది. అట్లా పనుల మీద కలెక్టరాఫీసు కెళ్లినప్పుడు ఆమెకి అక్కడ పనిచేసే రాజేశం పరిచయమయ్యాడు. పద్మ తండ్రి సూరత్‌లో పవర్ లూంలో పనిచేసేవాడు. అక్కడ మిల్లులు మూతబడి మరోదారి కానరాక, కరీంనగర్‌కి కుటుంబంతో సహా తిరిగి వచ్చాడు. అప్పుల పాలై అనారోగ్యంతో అతను చనిపోయాక, ఆ కుటుంబభారం ఇంటికి పెద్దదైన పద్మ మీద పడింది. ఇంటర్ చదువు మధ్యలోనే ఆపేసి, తల్లితోపాటు పనులు చేయడం మొదలుపెట్టింది. రాజేశం పరిచయమయ్యేనాటికి పద్మకి పాతికేళ్లు దాటాయి. ఆమెకి పెళ్లి చేయాలన్న ధ్యాస ఎవరికీ వుండేది కాదని, ఒకటి రెండు సంబంధాలొచ్చినా తల్లే పడనీయలేదని అంటుంది పద్మ. ఎప్పటికి తీరుతుందో తెలీని కుటుంబ భారాల మధ్య, ఆర్థిక ఇబ్బందుల మధ్య, ఒంటరితనం మధ్య, రాజేశ్‌తో పరిచయం, అతడు ఆమెపట్ల చూపే ఆసక్తి, ఆమెకి బాగా అనిపించేది. అతడు ఆమె కన్నా పదిహేనేళ్లు పెద్దవాడు. ఆర్థికంగా సాయపడేవాడప్పుడప్పుడూ. తనపట్ల ఆత్మీయత కనపరిచినందుకో, లేక తనకంటూ ఇల్లూ, సంసారం కావాలనుకోవడమోగానీ పద్మ మెల్లిగా అతను చెప్పినట్లు వినడం, తన కష్టాలు అతనితో పంచుకోవడం మొదలుపెట్టింది.

అతనికి అంతకుముందే మేనమామ కూతురుతో పెళ్లయింది. మంథని దగ్గర ఓ పల్లెటూరు అతని సొంతూరు. ఊర్లో వ్యవసాయం వుంది. అతని తల్లి దండ్రులతో పాటు అతడి భార్య కూడా ఊర్లోనే వుంటుంది. అతనికి ఇద్దరు పిల్లలు. చాలా ఆలస్యంగా పద్మకీ సంగతులు తెలిసేనాటికి, ఆమె నాలుగో నెల గర్భవతి. విషయం తెలిసి తల్లీ, మేనమామలు కొట్టి నిర్బంధిస్తే, తప్పించుకు పారిపోయి వచ్చి అతడ్ని కలుసుకుంది. రాజేశం కాళ్ల మీద పడి ఏడ్చింది పద్మ, పెళ్లి చేసుకొమ్మని. తానొక ప్రభుత్వోద్యోగి, పెళ్లి చేసుకోలేనని కావాలంటే రహస్యంగా ఉంచుకుంటానని అన్నాడట.

పురుషులు అనుభవిస్తారు, స్త్రీలు లొంగిపోతారు. వీళ్లు అతడ్ని నమ్మి దేహాన్ని పంచుతారు. అతడు దయగలవాడైతే పెళ్లాడకుండా అట్లా వుండనిస్తాడు.

"నాకు నీతోని సంబంధం లేదు. ఇంకెవనితో తిరిగినవో నాకేమెర్క అని చేతులు దుల్పుకున్న నేను జేసెడిదేముంటది? వదిలెయ్యకుండ ఆ యింత ఉండ నిచ్చిండు సాలనుకున్న," అంది పద్మ.

ఎవరికీ తెలీకుండానైనా, కనీసం ఏ గుడిలోనన్నా తన మెడలో తాళిబొట్టు కట్టమంది పద్మ. అతడు కట్టనన్నాడు. ఆమె కరీంనగర్‌లో గిల్టు నగలమ్మే దుకాణంలో వంద రూపాయలకి ఒక మంగళసూత్రం గొలుసు కొనుక్కుని దేవుడి పటం ముందు పెట్టి తన మెడలో తానే వేసుకుంది. ఉన్న ఊర్లో మరీ బట్టబయటలుగా కాపురం పెట్టేందుకు అతడు సిద్ధంగా లేడు. జగిత్యాలలో, ఓ మారుమూల సందులోని ఓ రేకులింట్లో వాళ్ల కాపురంలాంటిది మొదలైంది. అతని పేరు తప్ప, మరే నిజాలు ఆమె ఎవరికీ చెప్పకూడదు. ఏవో కాంట్రాక్టు పనులు చేస్తాడని, ఊర్లు తిరుగుతూ ఉంటాడనీ, ఆమె చెప్పుకునేది. అక్కడే పద్మకి నీలవేణి పుట్టింది. ఆ కాన్పులోనే ఆమెకి మళ్లీ పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించేశాడతను.

ఇక అక్కడి నుండి ఆమె కాపురం చాలా ఊర్లకి మారింది. గజ్వేలు, సంగారెడ్డి, ఇల్లెంతకుంట, కామారెడ్డి... ఇట్లా ఊర్లు తిరిగి చివరికి జమ్మికుంటకు చేరుకుంది. అతడు ఇంటికొచ్చినప్పుడు ఎన్ని రోజులుంటాడో తెలీదు. ఆ ఉన్నప్పుడు వాళ్ల మధ్య సరసాలు, విరసాలు, కోపతాపాలు, కొట్లడాలు అన్నీ జరుగుతాయి. వాళ్లింటికి ఎవరూ రారు. ఆమె తన సంగతులు ఎవరికీ తెలీకూడదనుకుంటుందేమో, ఎన్నడూ బయటికి రాదు. పెద్దగా ఎవరితోనూ మాట్లాడదు. అతడు గత కొంతకాలంగా రావడం తగ్గించాడు. డబ్బులకి ఇబ్బంది పడుతూ ఏం చేయాలో దిక్కుతోచక మధనపడుతోంది. పద్మ మొదటిసారి తన గురించి, తన పరిస్థితి గురించి శ్యామలకి చెప్పుకుంది.

"మీరే ఏదైనా పని ఇప్పించుండ్రి. మా ఆయనకి తెల్వకుండ జేస్త," అంది పద్మ.

ఏం చేయగలదు శ్యామల? తనింట్లో పనిచేసే ఎల్లమ్మతో మాట్లాడి, ఒక బీడీ కార్ఖానా నుండి ఆకు, తంబాకు తెప్పించే ఏర్పాటుచేసింది. అవి ఇంట్లో పెట్టకుంటే రాజేశానికెక్కడ తెలిసిపోతుందోనన్న భయంతో శ్యామలా వాళ్ల వరండాలోనే ఓ మూలకు పెట్టుకుని

అక్కడే పనిచేసేది. ఆ బీడీల్ని ఎల్లమ్మే కార్ఖానాలో ఇచ్చి డబ్బులు తెచ్చిపెట్టేది. ఆమె కోసం శ్యామలే కొంతమంది ట్యూషన్ పిల్లల్ని ఏర్పాటుచేసింది. వాళ్లకి కూడా మళ్లీ శ్యామల వరండాలోనే కూర్చుని ట్యూషన్ చెప్పేది. ఇంత బాధ్యత, ఈ గొడవంతా తనకి అవసరమా అని చాలాసార్లనిపించేది శ్యామలకి. కానీ నీల పట్ల పెరిగిన ప్రేమ, పద్మ నిస్సహాయత పట్ల జాలితో శ్యామల సహించేది.

తండ్రి చనిపోతే, ధైర్యంగా చిన్న వయసులోనే బాధ్యతల్ని తలకెత్తుకున్న పద్మ ఎందుకంత పిరికిగా అతడి విసుగునీ, చీదరింపులనీ, అవమానాల్నీ భరిస్తూ అతడు విదిల్చే తిండిగింజల్ని ఏరుకుంటూ, అదంతా అతడిపైన తన అలవిమాలిన ప్రేమకి చిహ్నంగా భావిస్తూ, అతడు తనని దిక్కుమాలిన దానిలా వదిలేయకుండా కనీసం అలా అన్నా చూసుకుంటున్నందుకు ఆనందిస్తూ బతుకుతోంది. నిజానికి, ఆమె బతికేందుకు ఆలంబన నీలవేణే అనిపించేది శ్యామలకి.

అతడి వ్యవహారం తెలిసి అతడి ఇంట్లో గొడవలు ప్రారంభమయి కొంతకాలమైంది. ఆ విసుగు, కోపం అతడు మళ్లీ పద్మ మీదే చూపించేవాడు. గట్టిగా ఓ మాటంటే... అతడికి అసౌకర్యంగా అనిపిస్తే పూర్తిగా రావడం మానేస్తాడేమోనని పద్మ చాలా భయపడేది. అతడు జమ్మికుంట నుండి మళ్లీ కాపురాన్ని మార్చేస్తానన్నప్పుడు మాత్రం వద్దు ఇక తిరిగింది చాలని, అక్కడి నుండి కదలలని మొండిపట్టు పట్టింది. అతడి చేతిలో దెబ్బలు తిన్నా మొండిగా కదలననింది. ఇన్నేళ్లకి తన కష్టం, సుఖం చెప్పుకునేందుకు శ్యామలలాంటి మనిషి దొరకటం నీల గురించి, తన గురించి, ఆమె శ్రద్ధగా పట్టించుకోవడం రహస్యంగానైనా తనకంటూ ఆర్థికంగా ఒక ఆధారం దొరకటంతో పద్మకి కాస్త ధైర్యం వచ్చింది.

బయట్నుంచి సుజాత తలుపు కొడుతుంటే, మంచంపై పరిచిన ఆ సరంజామానంతా మళ్లీ బట్ట సంచీలో వేసి, అల్మారాలో దాచేసి తలుపు తీసింది నీల.

"ఏం చేస్తున్నావ్? ఇందాకటి నుండీ తలుపు కొడుతూ వుంటే వినపడలేదా?" తానేం చేస్తుందో సుజాతకి చెప్పలేదు నీల. ఇద్దరూ కలిసి ఆసుపత్రి కెళ్లేసరికి, 'అప్పుడే శ్యామలని ఇంటెన్సివ్ కేర్‌లోకి తీసుకెళ్లారని,' చెప్పాడామె తమ్ముడు. అతడి భార్య చీరె చెంగుతో కళ్లు తుడుచుకుంటూ వుంది.

"నీతో మాట్లాడి దాని ఇష్టప్రకారమే ఇంటికి తీసుకొచ్చేద్దామనుకుంటుంటే, ఇప్పుడిలా... ఇదేంటి..." కళ్ల నుండి నీల్లు కారుతుండగా దుఃఖంతో పూడుకుపోతున్న గొంతుతో అంటోంది సుజాత, శ్యామల తమ్ముడితో.

నీల కళ్లల్లో నీళ్లు లేవు. లోలోన ఏదో గడ్డ కట్టిన భావన. చీకటి కమ్ముకుంటున్న ఈ రాత్రి నుండి, శ్యామలా టీచర్ బయటపడి వెలుతురు చూస్తుందా?

"మరో నాలుగైదు రోజులన్నా వుంటుంది, ఫర్వాలేదన్నారు కదా!" డాక్టర్లను అడుగుతోంది సుజాత.

"పేషెంట్ క్రిటికల్ కండిషన్‌లోనే వుంది కదండీ! ఎప్పుడైనా ఏమైనా అవ్వొచ్చు," డాక్టర్ ఏదో వివరిస్తున్నాడు. ఇక వినేందుకేమీ లేదు. ఆమె తనకింకా చెప్పాల్సిన విషయాలున్నాయా? శ్యామలా టీచర్ ఆఖరి మాటలు, చనిపోయే ఆ చివరాఖరి క్షణంలో చెప్పాల్సిన ఆఖరి మాటలు... అమ్మ... అమ్మ చనిపోయే ముందు తనకోసం చెప్పిన ఆఖరి మాటలేమన్నా ఉన్నాయా? తెలీదు తనకి. చెప్పగలిగిన శ్యామలా టీచర్ కూడా చచ్చిపోబోతూ వుందిప్పుడు.

చావు భయపెడుతుంది. చావంటే మనుష్యులు హఠాత్తుగా మాయమైపోవడం... నేను చచ్చిపోతానేమోనన్న భయంతో, నా వాళ్లెవరూ లేకుండా అందరూ చచ్చిపోతారేమోనన్న భయంతో, చావు భయంతోనే నిత్యం మనుష్యులు బతుకుతూ వుంటారా?'

చావు నీల దగ్గర వరకూ వచ్చి ఆగిపోయింది. కానీ అది వాళ్లమ్మతో సంభాషించింది. నీలా వాళ్లమ్మ పద్మ చచ్చిపోయింది. ఎట్లా చచ్చిపోయింది? పక్కటెముకలు విరిగిపోయి, పొత్తి కడుపులో దెబ్బలు తగిలి, లోపలి అవయవాలు చితికిపోయి, ఊపిరితిత్తులు గాయపడి, తల పగిలి, పళ్లు విరిగిపోయి, వంటినిండా గాయాలు తగలని ప్రదేశం లేకుండా నీలా వాళ్లమ్మ చచ్చిపోయింది. ఎవరికన్నా కోపం వస్తే, వాళ్లమ్మని కొట్టినట్టు కొట్టి, హింసించి, చంపేయచ్చని, అర్థమైన ఆ రోజంటే నీలకి చాలా భయం. అమ్మ నవ్వు మొఖం నీలకెప్పుడూ గుర్తు రాదు. పగిలిన తల నుండి కారిన రక్తపు చారికల మొఖం గల అమ్మ, జుట్టుపట్టుకు లాక్కెడుతుంటే కొంగు జారిపోయి అర్ధనగ్నంగా ఏడుస్తూ వదిలేయమని కాపాడమని అరుస్తున్న అమ్మ- అట్లాంటి అమ్మ ముఖం అస్పష్టంగా గుర్తుంది. అమ్మ... నీలా వాళ్లమ్మ చచ్చిపోయింది చివరికి. మనుష్యులతో మన చివరి జ్ఞాపకం, ఎందుకంత భీతావహంగా వుండాలి? ఇప్పుడు శ్యామలా టీచర్ కూడా చచ్చిపోతుంది. అమ్మలా... అట్లానే కాదుకానీ చచ్చిపోతుంది. తనతోపాటు తీసుకెడతానని ఆమె తమ్ముడంటే రాననింది. తనని వదిలివెళ్లడం టీచర్‌కి

ఇష్టముండదని తెలుసు తనకి. కానీ, చావు పిలిచి నప్పుడు ఆమె రానని చెప్పగలుగుతుందా? అసలెవరైనా అట్లా చెప్పగలరా? చావు ఆమెని, సుతిమెత్తటి పూల పాన్పుపై కూర్చోబెట్టి తీసుకెడుతుందా? కర్కశంగా, ముళ్లదారుల గుండా ఈడ్చుకెడుతుందా? నీలకిప్పుడు దుఃఖం వచ్చేలా వుంది. దిగులు, దిగులుగా, భయం భయంగా వుంది. ఎక్కడన్నా దాక్కోవాలి. ఎవరి కంటా పడకుండా దాక్కోవాలి? అమ్మ కడుపులో తప్ప దాక్కుంటే కనపడని చోటెక్కడుంది? నీలకి అమ్మలేదు కదా!

సుజాత వచ్చి, నీల భుజం చుట్టూ చేయి వేసి కూర్చుంది. ఆమె భుజంపై తల వాల్చి కూర్చుంటే నీల కెందుకో నిశ్చింతగా అనిపిస్తుంది.

అమ్మ గురించి శ్యామల మాట్లాడిన ఆ రాత్రి గుర్తు కొచ్చింది నీలకి.

"ఆరోజు నువ్వెక్కడ దొరికావో గుర్తుందా?" ఏ రోజని అడగలేదు నీల. తల అడ్డంగా వూపింది.

"ఆరోజు, ఆ సంఘటన జరిగిన రోజు, ఉదయం నేను కలెక్టరాఫీసు కెళ్లాను. పనయ్యాక సాయంత్రం మాకు తెలిసిన బంధువులింటి కెడితే వాళ్లు భోజనం చేసి వెళ్లమని బలవంతం చేశారు. ఆఖరి బస్సులో నేను ఊరి కొచ్చి, ఇంటివైపు నడుస్తుంటే ఊరు ఎప్పటిలా తొందర గానే నిద్రపోయినట్లనిపించింది. చేతిసంచీ ఇంట్లో పడేసి, టాయిలెట్ కెళ్లేందుకు ఇంటి వెనకకి వచ్చి టాయిలెట్ తలుపు తీస్తూ వుంటే సన్నగా భయం, భయంగా వెక్కిళ్లు ఆపుకుంటూ ఏడుస్తున్న పిల్లల స్వరంలా వినిపించి హడలిపోయాను. ఆ శబ్దం వచ్చిన వైపు టార్చిలైట్ వేసి చూస్తే నీళ్ల డ్రమ్ములు, బకెట్లూ పెట్టుకునేచోట, వాటిమధ్య వున్న ఖాళీస్థలంలో దాక్కొని సన్నగా ఏడుస్తున్నావ్. లైటు వెలుతురు నీపైన పడగానే నీ కళ్లలోకి పాకిన భయం నాకింకా గుర్తుంది."

చేతివేళ్లు చూసుకుంటూ, "అదంతా, ఇప్పుడెం దుకు టీచర్," అంది నీల అయిష్టంగా.

"నేను చెప్పే విషయాల్ని నువ్వెలా అర్థం చేసు కుంటావో అది నీ ఆలోచనల తీరును బట్టి ఉంటుంది. మాటలకి అర్థాలు లోకంలో ఒక్కో తీరుగా నిర్వచిస్తారు. లోక రివాజు, లోకం ఒప్పుకోలు ప్రకారం, మీ అమ్మ జీవించలేదు. ఒక ఆటవిక చర్యకి, మీ అమ్మ బలైంది. అది నీకర్థం కావాలి. జీవితాలకి నిర్వచనాల్ని, ప్రమా ణాల్ని ఇచ్చే పని అందర్లానే నువ్వూ ఎప్పుడోకప్పుడు మొదలెడతావ్. అప్పుడు నీ గురించి, మీ అమ్మ గురించి, అలాంటి అనేకానేక ఆడవాళ్ల గురించి, చివరికి నా గురించి నువ్వు ఎట్లా ఆలోచిస్తావనిపించింది నాకు," అంది శ్యామల.

"మీ గురించా?" అప్రయత్నంగానే అడిగింది నీల.

"అవును నా గురించే," అంటూ చిన్నగా నవ్వింది శ్యామల.

శ్యామల నీల చదువు పట్ల చాలా పట్టింపుగా వుండేది. ఆమెతో కన్నా, సుజాత దగ్గరే భయం లేకుండా మాట్లాడగలిగేది నీల. శ్యామలా టీచర్ అంటే తనకి ఇష్టమా, ప్రేమా, భయమా, భక్తా లేక మరో గత్యంతర మేమీ తనకు లేదని ఆ చిన్న వయసులోనే అర్థం కావడం వల్ల వచ్చిన అణకువా? కృతజ్ఞతా? ఆమెను నీల ఎప్పుడూ అమ్మా అని పిలవలేదు. ఆమె కూడా అట్లా పిలవమని నీలనెన్నడూ అడగలేదు. ఆమె పట్ల తనకున్న భావం ఇదమిద్ధంగా ఇదీ అని నీలకెప్పుడూ అర్థమయ్యేది కాదు.

శ్యామల తమ్ముడితో డాక్టర్లేదో మాట్లాడుతుంటే సుజాత, నీల కూడా దగ్గరి కెళ్లి నిలబడ్డారు. వెంటిలేటర్ పై కృత్రిమశ్వాసతో ఆమె ఇంకా బతికే వుందట. ఆ సంభాషణల మధ్య నుండి మెల్లిగా బయటకు నడిచి నిలువెత్తు గాజు తలుపులు బిగించి ఆ ఆసుపత్రి ఆరో అంతస్తు నుండి బయటకు చూస్తూ నిలబడింది నీల. లైట్ల వెలుతురు పరుచుకుని నగరం ధగధగలాడు తోంది. ట్యాంకుబండ్ లైట్ల మధ్య నిలువెత్తు బుద్ధ విగ్రహం- నిద్రపోతున్న ఆ నగరంలో అర్ధరాత్రి రెండు గంటలకి ఒక జీవితపు పరిసమాప్తి గురించి మేల్కొని ఎదురుచూస్తూ నిలబడ్డ నీలవేణి.

'బహుశా ఇట్లాంటి రాత్రేనేమో నేను అట్లా నాలోకి నేను భయంతో ముడుచుకుని, శ్యామలా టీచర్‌కి దొరికింది,' అనుకుంది.

"నువ్వొకదానివి వున్నావన్న ధ్యాసే, అప్పటిదాకా ఎవరికీ వున్నట్లులేదు. నిన్ను మా వరండాలోకి తీసుకొచ్చి మీ అమ్మేది, ఏం జరిగిందని అడుగుతూ వుంటే నువ్వు భయంతో వొణికిపోతున్నావ్. ఏం అయిందో నాకర్థం కాలేదు. ఆ వెలుతురికి, మాటల చప్పుడుకి పై నుండి ఇంటి ఓనర్ భార్య, పిల్లలు దిగొచ్చారు. ఇరుగు, పొరుగు మూగారు."

శ్యామల ఒక్క నిమిషం చెప్పటం ఆపి, బాధా మయ జ్ఞాపకాన్నేదో నెమరు వేసుకుంటున్నట్లు తల వంచుకుని తిరిగి చెప్పడం ప్రారంభించింది.

"మీ నాన్న భార్య వైపు బంధువులు పంచాయితీ పెట్టారట. అతనికి ఇంట్లో గొడవలు పెరిగిపోయాయట. ఎలా కనుక్కున్నారో, జమ్మికుంటలో అతడు మీ అమ్మతో కలిసి వుంటున్నాడన్న సంగతి కనుక్కుని రెండు జీపుల్లో అతడి మామ, బావమరుదుల బంధువులు, అతడి అత్త, భార్య అందరూ వచ్చి మీ ఇంటిమీద పడ్డారు. మీ అమ్మ వేడికోళ్లని, ఏడుపును వాళ్లు పట్టించుకోలేదు. ఎవరు తనకి తోడుగా వుంటాడని నమ్మి అతను చెప్పినట్లు నడుచుకుందో అతను, ఆ రాజేశం, అదే మీ నాన్న... మీ అమ్మని ఆ వచ్చినవాళ్లంతా కలిసి కొడుతూ వుంటే కనీసం అడ్డుకునేందుకు కూడా ప్రయత్నించలేదట. వాళ్లు తెచ్చిన జీపులోకెక్కి మౌనంగా కూర్చున్నాడట. వాళ్లు ఇంట్లో సామానంతా విరగ్గొట్టి వీధిలోకి విసిరేసి అగ్గిపుల్ల గీశారు. మీ అమ్మని ఇంట్లో నుండి బయటకు ఈడ్చుకొచ్చి, స్పృహ తప్పి పడిపోయేంత వరకూ ఇష్టం వచ్చినట్లు కొట్టి, ఆమెనొక మరబొమ్మలా బద్దలు చేసి, అతడ్ని తీసుకుని వాళ్లు వెళ్లిపోయారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఒకరిద్దర్ని ఊరి పెద్ద మనుష్యులెవరో వద్దని ఆపారట. ఎందుకంటే మీ అమ్మ లేచిపోయి వచ్చిన ఆడది. అది ఆ కుటుంబ సమస్య. జనం చోద్యం చూస్తూ నిలబడ్డారట. మరొక ఆడదాని జీవితాన్ని, ఓ కుటుంబాన్ని నిలబెట్టేందుకు వాళ్లకు తోచిన మార్గం అది. ఎవరో పోలీసులకి ఫోన్ చేశారు. వాళ్లొచ్చి స్పృహ లేని మీ అమ్మని కరీంనగర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు," శ్యామల దీర్ఘంగా నిట్టూర్చింది.

"ఆ రాత్రి నువ్వు నా పక్కనే, నిద్రలో ఉలిక్కి పడుతూ పడుకున్నావ్. ఉదయం వళ్లు తెలీని జ్వరం నీకు. కాసేపటికి ఊరి సర్పంచు, ఇంటి ఓనరు, మా ఇంటికొచ్చి చెప్పారు. వంటినిండా గాయాలతో, ఊపిరి తిత్తులు దెబ్బతిని, చాలా అవస్థపడి, మీ అమ్మ చనిపోయిందని... మీ అమ్మ తల్లికి... అదే మీ అమ్మమ్మకి కబురు చేస్తే శవాన్ని తీసుకెళ్లేందుకు కాదు, చూసేందుకు కూడా ఎవరూ రాలేదట. దాంతో ఊరి పెద్ద మనుష్యులు, పోలీసులే పోస్టుమార్టం తరువాత మీ అమ్మని దహనం చేశారు."

నీల నిశ్శబ్దంగా వింటోంది.

"ఆ జ్వరంతో నిన్ను ఆఖరిసారి మీ అమ్మని చూసేందుకు తీసుకెళ్లలేకపోయాం. నే వెళ్లాను. నిస్సహాయంగా నా ముందు ఏడ్చే మీ అమ్మ, ఆ రాజేశం ఎక్కడ తనని వదిలి పెట్టేస్తాడోనని భయం భయం బతికే మీ అమ్మ, నవ్వడం మర్చిపోయిన మీ అమ్మ మెల్లిమెల్లిగా ధైర్యం తెచ్చుకుని తన బతుకు తాను బతికేందుకు ప్రయత్నాలు ప్రారంభించిన మీ అమ్మ నా కళ్ల ముందు నిలువెత్తు మంటల్లో దగ్ధమైపోతున్న దృశ్యం నాకెంతకీ మరపురాదు.

ఇదంతా చెబుతున్నప్పుడు శ్యామలా టీచర్ కళ్లలో తడి, ఆమె మధ్య మధ్య ఆగి దుఃఖాన్ని ఆపుకుంటున్నట్లు మాట్లాడటం, నిన్న మొన్న జరిగినట్లుగా అనిపిస్తోంది నీలకి.

పద్మనే పట్టించుకోని ఆమె కుటుంబసభ్యులు, నీలవేణి గురించి సహజంగానే పట్టించుకోలేదు. నీలని అనాధాశ్రమంలో చేర్పిస్తామంటే ఊరి పెద్దమనుష్యులతో, పోలీసులతో మాట్లాడి చేయాల్సిన ఫార్మాలిటీసేవో పూర్తిచేసి, శ్యామలే చట్టబద్ధంగా దత్తతకు తీసుకుంది. జమ్మికుంటలో ఉద్యోగం మానేసి, నీలతో సహా హైదరాబాద్ వచ్చేసి, ఓ కాలేజీలో లెక్చరర్‌గా చేరింది శ్యామల. రాజేశానికిగానీ, పద్మపై దాడి చేసినవారికిగానీ ఎలాంటి శిక్షా పడలేదని, అందుకోసం అతడు భారీగానే ముడుపులు చెల్లించుకున్నాడని, అతను కరీంనగర్‌లోనే ఉద్యోగం చేసుకుంటూ, భార్యాపిల్లలతో వుంటున్నాడని ఓసారెప్పుడో ఆ ఊరివాళ్లు చెబితే తెలిసింది శ్యామలకి.

పద్మలా, తనలా ఆడదాని జీవన విధ్వంసానికి మూలం, మగవాడిని గుడ్డిగా నమ్మటంలో వుందేమో అన్పించేదామెకి చాలాసార్లు.

శ్యామల కూడా తమ ఇంటి డాబాపైన గదిలో అద్దెకు దిగిన దూరపు బధువులబ్బాయి, డాక్టర్ సుధీర్ కుమార్‌ను నమ్మింది. ఆమె అతడ్ని ప్రేమించింది. పెళ్లి చేసుకోవాలనుకుంది. అతను కూడా ఆమెకి అవే మాటలు చెప్పాడు. ఆమె శరీరాన్ని అతడు తాకినప్పుడు, కోరినప్పుడు, ఆమె తిరస్కరించినప్పుడు అతడు తనపై ఆమె నమ్మకాన్నీ, ప్రేమనీ ప్రశ్నించాడు. నమ్మినవాడికి శరీరాన్ని కూడా ఇచ్చినప్పుడే అది నిజమైన ప్రేమ, నమ్మకమవుతుందని అతడు చెప్పిన నమ్మకాల పాఠాన్ని ఆమె నిజంగానే నమ్మింది. అతని చేతులు ఆమె శరీరం మీద... అతని చూపులు, ఆశలు త్వరలో చేసుకోనున్న అమెరికా సంబంధం పైన ఉన్నాయన్న విషయం అప్పుడామెకి తెలీదు. ఆ తర్వాత అతడు మెల్లిగా ఆమెకి మొఖం చాటేయడం మొదలుపెట్టి ఆసుపత్రికి దూరమవుతోందంటూ మకాం మార్చేశాడు. శ్యామలకి అతడు మరో పెళ్లి చేసుకోబోతున్నాడని తెలిసి అతన్ని వెతుక్కుంటూ వెళ్లి తనని మోసం చేయవద్దని ఏడ్చింది. అతడొక విషపునవ్వు నవ్వి... "పెళ్లికి ముందే లొంగిపోయిన

దానివి. నువ్వేం అమాయకురాలివి? మరొకడ్నెవరినన్నా తగులుకో. వాడన్నా నిన్ను పెళ్లి చేసుకుంటాడేమో,'' అన్నాడు.

శ్యామల ఆత్మహత్యకి ప్రయత్నించి విఫలమై, తల్లిదండ్రుల ముందు, బంధుమిత్రుల ముందు దోషిలా తలవంచుకుని... కుంగిపోయింది. ఆమె బతికినా... అంతకుముందులా గలగలా మాట్లాడే శ్యామల కాలేకపోయింది మరెన్నడూ. ఒక నిత్య గాయాన్ని, విషాదాన్ని, బరువునూ మోస్తూ నవ్వటం మర్చిపోయిన శ్యామలైంది.

ఇదంతా శ్యామల చెప్పలేదు నీలకి. ఆమె ఎందుకు వంటరిగా మిగిలిపోయిందని నేరుగా అడిగేందుకు భయం నీలకి. ఒకసారెప్పుడో... సుజాతే శ్యామల గురించి నీలకి చెప్పింది. ఇక శ్యామల పెళ్లనే ఆలోచననే తన జీవితంలోంచి తీసేసింది.

''సపోర్టింగ్ సిస్టమ్స్ ఎప్పుడు తీసేస్తే, అప్పుడు చనిపోతుందంటున్నారు. మనం ఎప్పుడు చెబితే అప్పుడు తీసేస్తారట. ఏం చేద్దాం?'' నీలని సలహా అడుగుతున్నాడు శ్యామల తమ్ముడు. నీలకి పట్టరాని దుఃఖం వచ్చింది.

''మీరెలా అనుకుంటే, అలా చేయండంకుల్,'' అందతనితో, కళ్లు తుడుచుకుంటూ.

సూర్యుడు లోకంపై వెలుగురేఖల్ని పరుస్తున్న ఆ ప్రభాతవేళ... శ్యామల ఊపిరి ఆ పంచభూతాల్లో కలిసిపోయింది. మనుష్యులు మనల్ని విడిచిపోతారు ఒక్కొక్కరుగా! అమ్మ చనిపోయినప్పుడామె చితిమంటల్ని చూడలేదు నీల. ఇప్పుడు శ్యామలా టీచర్‌ని చూస్తోంది. సుడులు, సుడులుగా పైకి ఎగిరిపోతున్న నల్ల నల్లటి పొగ మేఘాల మధ్య చలిస్తూ ఎగిసి పడుతున్న ఆ మంటల మధ్య చల్లటి చలనరహిత శరీరంగా మారి మెల్లిమెల్లిగా అదృశ్యమైపోతున్న శ్యామలా టీచర్. ఎవరూ లేని ఏకాకితనమేదో తనలోకి మెల్లిగా ఇంకుతున్నట్లనిపించింది నీలకి. తనని అంటి పెట్టుకుని తనతోపాటు నడిచిన చల్లటి నీడేదో తొలగిపోయి కాలుతున్న ఇసుక ఎడారిలో వట్టి కాళ్లతో నిలబడ్డట్టనిపించి సుజాత చేతిని గట్టిగా పట్టుకుని నిలబడింది.

శ్యామల తమ్ముడు, మరదలు తమతోపాటు బెంగుళూరొచ్చి కొన్నాళ్లుండమన్నారు. శ్యామల బతికున్నప్పుడే ఎక్కువగా వాళ్లింటికెళ్లేవాళ్లు కాదు. ఇక ఇప్పుడు వెళ్లాలనిపించలేదు నీలకి. నిజానికి, వాళ్లు తనకంత దగ్గరివాళ్లు కాదు. ఆ స్వాంతన, తోడు, ధైర్యం సుజాత దగ్గరే దొరుకుతాయి నీలకి. 'ఇక నుండీ నీల మంచిచెడ్డలన్నీ నీ బాధ్యతే,' అంటూ శ్యామల సుజాతకి అప్పగింతలు కూడా పెట్టింది.

శ్యామల అస్థికల్ని నిమజ్జనం చేసేందుకంతా వెళ్లినప్పుడు ఆమె తనకిచ్చిన ఆ బట్టల సంచీని, తెలిసీ తెలియని ఆ వయసులో తానేరుకుని తెచ్చుకున్న వస్తువులున్న ఆ జ్ఞాపకాల సంచీని కూడా తనతోపాటు తీసుకెళ్లింది నీల.

కృష్ణానదీ తీరంలో శ్యామల అస్థికల్ని కలిపే ఆ తతంగమంతా పూర్తయ్యాక నీల ఒక్కతీ ఆ బట్టల సంచీని పట్టుకుని ముందుకు నడిచి వెళ్లింది. ఇసుకలో బండరాళ్లను దాటుకుంటూ వెళ్లింది. 'ఇక చాలు మోస్తున్న జ్ఞాపకాల భారం. ఇక చాలు ఈ దరిలేని దుఃఖ సముద్రం. చాలిక. భరించలేను,' అనుకుంటూ, ఆ సంచీని నీటిలోకి విసిరేయబోతే, ఏదో సున్నితంగా మోగుతోంది. సంచీ తీసి చూస్తే, అవి నీలా వాళ్లమ్మ కాలిమువ్వలు. అలానే విసిరేయబోయి, ఎందుకో ఆ కాలిమువ్వని మటుకు చేతిలోకి తీసుకుని సంచీని నీటి అలల మధ్యకి విసిరేసింది. ఒక దుఃఖపు జాడ ఆ మువ్వ. ఇసుకలో ఆ బండరాతిపైన కూలబడి కాలి మువ్వను చెంపకాన్చుకుంటే గాలికి ఆ చిరుమువ్వల నుండి సన్నటి నాదం. దుఃఖం, ఆగ్రహం, ఆక్రోశం, ఒక విరిగిన నవ్వు కలగలిసిన నిస్సహాయనాదం బహుశా ఆ రాగం పద్మదీ, శ్యామలదీ, రాజేశం వాళ్ల భార్యదీ... ఇంకా, ఇంకా అలాంటి అనేకానేకమంది స్త్రీల నుండి వస్తున్నట్లుంది.

దూరం నుండి సుజాత పిలుస్తోంది వెనక్కి రమ్మని. ఆ కాలిమువ్వను నీటిలోకి విసరబోయి, ఒక్క క్షణం ఆగిపోయింది నీల. బిగి పిడికిట్లో దాన్ని గట్టిగా పట్టుకుని, వెనక్కి తిరిగిన ఆమె కంటి నుండి ఓ కన్నీటి చుక్క ఆ మువ్వపై రాలబోయి, అట్లా నిలిచిపోయింది.

*నవ్య వీక్లీ, 26 జూన్ 2013*

